
ప్రజాశక్తి

ఆదివారం 17 ఆగస్టు 2025 5 విజయనగరం



మద్యం బార్లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లాలో మద్యం బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనాధుడు తెలిపారు. బార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ లు, నగర పంచాయతీల్లో 28బార్‌లు నోటిఫై చేసినట్లు తెలిపారు వీటిలో 3 (2బి) బార్లు కల్లు గీత కులాల కు కేటాయించినట్లు తెలిపారు. వీటిని వేలం ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు నాన్ రిఫండబుల్ ఫీజు రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించాలని, పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోగల ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని, లేదా 9440902360, 9440902362 నెంబర్లను సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు

అన్నదాతకు మొండిచేయి

'అన్నదాత సుఖీభవ'లో భారీ కోత



అన్నదాత సుఖీభవ పథకం అమలులో టిడిపి కూటమి ప్రభుత్వం భారీ కోత పెట్టింది. ఆన్‌లైన్, ఇనాం, హెచ్ఒ ల్యాండ్స్ పేరుతో రైతులకు ఆర్థిక సాయం అందకుండా చేసింది. దీంతో వేలాది మంది రైతులు బోరుమంటున్నారు. గత ఐదేళ్లలో వైసిపి పాలనలో రైతు భరోసా ద్వారా లబ్ధి పొందిన రైతులకు తాజాగా కోత పెట్టడంతో ఆవేదన చెందుతున్నారు. ఆన్‌లైన్ సరిగా చేయకపోవడం, ఆన్‌లైన్‌లో తప్పుల నమోదు, ఆఫ్‌లైన్ విధానం లేకపోవడం, మరణించిన వారి పేర్లు మార్చకపోవడంతో ఈ సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. వీటన్నింటినీ పరిష్కరించాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పథకంలో కోత పెట్టి ఆర్థిక భారం తగ్గించుకునేందుకు చూస్తోంది.

ప్రజాశక్తి- గజపతినగరం రూరల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రధానమైన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఈనెల 2న రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు జమ చేసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పిఎం కిసాన్ కింద రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు కలిపి రూ.7వేలు చొప్పున వేసింది. అయితే జిల్లాలో 2,27,700 మంది రైతులకు రూ.152.45 కోట్ల రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్టు ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. కానీ జిల్లా వ్యాప్తంగా సుమారు 30వేల మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు అందలేదని తెలుస్తోంది. రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజవర్గంలో మండల వ్యాప్తంగా 12,800 మంది రైతులకు వ్యవసాయ శాఖ అప్రూవల్ ఇవ్వగా అన్నదాత సుఖీభవ పథకానికి 8800 మంది రైతుల ఖాతాల్లో మాత్రమే నగదు జమ అయ్యింది. ఇంకా 4వేల మంది రైతులకు పథకం అందలేదు. పురిటిపెంటలో సుమారు 80మంది రైతులకు ఈ పథకం వర్తించలేదు. వీరిలో 82మంది వరకు హెచ్ ఓవర్ (నాలావారి) భూములున్న రైతులు ఉన్నారు. వీరిలో కొందరికి పథకం వర్తించినా ఎక్కువ మందికి రాలేదు. వీరందరికీ గత ఐదేళ్లలో రైతు భరోసా పథకం వర్తించింది. తాజాగా వ్యవసాయశాఖ వీరి ఖాతాలను ఆన్‌లైన్ డిలీట్ చేయడంతో రైతులకు ఈ పథకం వర్తించలేదని తెలిసింది. రైతులు, టిడిపి నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో రెండో విడత వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

మండల వ్యాప్తంగా గత ప్రభుత్వంలో ప్రతి రైతుకు పెట్టుబడి సహాయం కింద 3సెంట్లు భూమి ఉంటే రైతు భరోసా పథకం వర్తించేది. తాజాగా కూటమి ప్రభుత్వం కనీసం 10 సెంట్లు భూమి ఉండాలని నిబంధనలతో వందలాది మంది ఈ పథకానికి దూరమయ్యారు. అంతేకాకుండా కొన్ని నెలల క్రితం సచివాలయ సిబ్బంది గ్రామాల్లో జిఎస్‌డబ్ల్యూఎస్ మ్యాపింగ్ సక్రమంగా చేయకపోవడం, ఈకెవైసి చేయకపోవడంతో రైతులు నష్టపోయినట్లు తెలుస్తోంది. రైతులకు కూడా సక్రమంగా అవగాహన లేకపోవంతో, అందరికీ ఒకే మ్యాపింగ్‌లో చేయడంతో చాలా మంది రైతులు అనర్హుల జాబితాలోకి వెళ్లిపోయారు. ఇంటింటి సర్వే చేస్తున్న సమయంలో సచివాలయ సిబ్బంది వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడం వల్ల కూడా చాలా మంది ఈ పథకానికి దూరమయ్యారు. గత ప్రభుత్వంలో నోషనల్ ఖాతా (5 అంకెలు) నెంబర్ కలిగిన వారికి పథకం వర్తించే విధంగా కుటుంబ సభ్యుల ఖాతాలు నామినిగా చేర్చే ఆప్షన్ ఉండేది. ప్రస్తుతం సుఖీభవ పథకానికి సంబంధించి నామిని ఆప్షన్, ఆఫ్‌లైన్ విధానం లేకపోవడం, ఖాతా నెంబర్లు చనిపోయిన వారి పేరు మీద ఉండటం, ఆధార్ అనుసంధానం అయినప్పటికీ ఖాతా వేరే వ్యక్తి పేరు మీద ఉండటంతో వందల సంఖ్యలో అన్నదాతలు అనర్హులుగా మిగిలిపోయారు. పథకం అమలు కాక మునుపే సచివాలయాల్లో ఎన్‌పిసిఐ లింక్, ఆధార్ లింక్ లేని వారి లిస్ట్ వచ్చినప్పటికీ రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో అనర్హులుగా మిగిలిపోయారు. ఈ నేపథ్యంలో తమకు పథకం వర్తింపజేయాలని రైతులంతా కోరుతున్నారు.

గత ఐదేళ్లు రైతు భరోసా వచ్చింది



గతంలో రైతు భరోసా కింద డబ్బులు ఇచ్చారు. ఇప్పుడు మాత్రం డబ్బులు పడలేదు. తాతల కాలం నాటి నుంచి భూములను సాగు చేస్తున్నా హెచ్ఒ భూములని, నోషనల్ ఖాతాలో ఉన్నాయని చెబుతున్నారు. గత ఐదేళ్లలో లేని సమస్య ఇప్పుడెందుకు వచ్చింది. అధికారుల తప్పిదమే కారణం. స్పందించి పథకం వర్తింప జేయాలి.

- పతివాడ రాములమ్మ,
పురిటిపెంట గ్రామం, గజపతినగరం మండలం

50 సెంట్లు ఉన్నా పథకం అందలేదు



50 సెంట్లు భూమి ఉన్నా అన్నదాత సుఖీభవ అందలేదు. ఈ విషయమై విఆర్‌ఒను కలిశాను. వేలిముద్ర పడలేదు నేనేమీ చేయలేను అంటున్నారు. సంబంధిత పైఅధికారులను కలసి ఈ సమస్యను పరిష్కారం చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద ప్రతి సంవత్సరం డబ్బులు పడేవి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత డబ్బులు పడలేదు.

- బండారు స్వామి నాయుడు,
చంద్రంపేట గ్రామం, గంట్యాడ మండలం

తండ్రి ఖాతాకు ఆధార్ లింకు అయింది



నా పేరు మీద భూమి ఉన్నప్పటికీ ఆధార్ నెంబర్ తండ్రి ఖాతా నెంబర్ కు లింక్ కావడంతో అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాలేదు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం వచ్చింది. తప్పులను సరిచేసి పథకం వర్తింపజేయాలి

- చల్లా గౌరి నాయుడు,
పాత బగ్గాం, గజపతినగరం మండలం

ఆధార్ లింక్ కాలేదట



ఆధార్ లింక్ లేక పోవడం వల్ల అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాలేదని అధికారులు చెబుతున్నారు. ఖాతా నెంబర్‌కు ఆధార్ అనుసంధానం చేసిన తర్వాత లింక్ చేస్తాం అంటున్నా రు. రెండో విడత వస్తాయంటున్నారు. ఏం చేస్తారో చూడాలి.

- గంట్యాడ గణపతి,
సాలిపేట గ్రామం, గజపతినగరం మండలం

అన్నదాత సొమ్ము అందలేదు



అర్హులమైనా అన్నదాత సుఖీభవ డబ్బులు రాలేదు. నోషనల్ ఖాతాకు ఆధార్ లింక్ లేకపోవడం రాలేదని చెబుతున్నారు. అధికారుల వద్దకు ఎన్నిసార్లు వెళ్లిన గ్రీవెన్స్ నమోదు చేయడానికి వెళ్లినా ఆఫ్‌లైన్ ఆప్షన్ లేదంటున్నారు. ప్రభుత్వం ఇటువంటి ఖాతాలకు ప్రత్యామ్నాయంగా ఏదైనా ఆప్షన్ ఇచ్చి మాకు న్యాయం చేయాలి.

- లెంక లక్ష్మి,
పురిటిపెంట, గజపతినగరం మండలం

గంట్యాడ ఎంఎంఎస్‌కు అవార్డు



అవార్డు అందజేస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ మండల మహిళా సమాఖ్యకు జాతీయ స్థాయిలో ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డు లభించింది. ఈ మేరకు ఎపిఎంలు ఎ.సులోచన దేవి, శ్రీనివాస్, గంట్యాడ మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కర్రి అనసూయమ్మ, కార్యదర్శి కంటిపాకు సీతమ్మకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అవార్డును అందజేశారు. రూ.3 లక్షలు చెక్కును అందించారు. దేశవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల నుంచి మొత్తం 22 సిఎల్‌ఎఫ్‌లు (మండల మహిళా సమాఖ్యలు/క్లస్టర్ మహిళా సమాఖ్యలు) ఎంపిక చేయగా, ఐదేళ్ల పైబడిన కేటగిరీలో గంట్యాడ మండల మహిళా సమాఖ్య ప్రథమ బహుమతి సాధించిన విషయం తెలిసిందే.



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

నిర్వాసితులను మోసగించిన జిందాల్

సిపిఎం ఆధ్వర్యాన ఖాళీ ప్లేట్లతో నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ ముందస్తు కుట్రలో భాగంగా నిర్వాసితులను నమ్మించి మోసగించిందని సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి జిందాల్ మాయలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారని దుయ్యబట్టారు. శనివారం బొడ్డవరలో సిపిఎం ఆధ్వర్యాన జిందాల్ నిర్వాసితులు ఖాళీప్లేట్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ అనేక విషయాలు బయటకు వస్తున్నా, అధికారులు, ప్రజాప్రతినిధులు జిందాల్ మాయలోనే ఉన్నారని ధ్వజమెత్తారు.

భూములు తీసుకున్నప్పుడు చెప్పిన మాటల ప్రకారం కంపెనీ కడితే ఉద్యోగాలు వస్తాయని, గిరిజన రైతుల బతుకులు బాగుపడతాయని ఆశపడ్డారని తెలిపారు. భూమిని తీసుకోవడం వల్ల ఆదాయం పోయిందని, ఉద్యోగాలూ రాలేదని వాపోయారు. ఒక తరమే నష్టపోవాల్సి వచ్చిందన్నారు. భూమిని జిందాల్ యాజమాన్యం ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ పేరుతో వ్యాపారానికి సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిర్వాసితుల భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పిఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మురళి, రవి



పిఆర్‌ఎంఇఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళి, రవి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లాశాఖ ఎన్నిక శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సిహెచ్ మురళి, రవికుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌వివి రమేశ్ , గౌరవాధ్యక్షులు బండి శ్రీనివాస్ హాజరయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా విశాఖ పట్నం జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు సంఘం అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, తూర్పు గోదావరి జిల్లా ఎపిఎన్‌జిఒ జాయింట్ సెక్రటరీ ఎన్. ఎంకెజి ప్రసాద్ వ్యవహరించారు. ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, సహాయ ఎన్నికల అధికారిగా విజయనగరం పట్టణ ఎపిఎన్‌జిఒ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.గోపాలకృష్ణ వ్యవహరించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల అన్ని తాలూకా యూనిట్లలో ఓటర్లు పాల్గొని నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సిహెచ్ మరళి, అసోసియేట్ అధ్యక్షులుగా బివి నాగభూషణరావు, ఉపాధ్యక్షులుగా టి.ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పిఎం రవికుమార్, కోశాధికారిగా వి.రాంబాబు, జాయింట్ సెక్రటరీగా ఎల్ వి ప్రసాద్, ఆర్గనైసింగ్ సెక్రటరీగా , కె.రాజ్ కుమార్, ఎం.నారాయణ రావు, డి హెచ్ వి ఆర్ ప్రభాకర్, బి.లక్ష్మణ్‌కుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్రకౌన్సిలర్‌గా ఎన్.అర్జునరావు, వివర్మ, కెబి శ్రీనివాస రావును, జెసిసి మెంబరుగా బివి గోవిందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ నాయకులు గంటా వెంకటరావు, ఆర్‌వి రమణ మూర్తి, ఎపిఎన్ జిఒ విజయనగరం జిల్లా సెక్రటరీ ఎ.సురేష్ పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి గౌతు లచ్చన్న

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

స్వాతంత్ర్య సమరయోధులు సర్ధార్ గౌతు లచ్చన్న భావితరాలకు స్ఫూర్తి అని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. ఆయన బడుగు బలహీన వర్గాలకు దిక్సూచి లాంటివారని పేర్కొన్నారు. సర్ధార్ జయంతోత్సవం కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి తరానికి సర్ధార్ గౌతు లచ్చన్న లాంటి మహనీయుల జీవిత చరిత్రలు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎక్కడా రాజీ పడకుండా జీవితాంతం పోరాటం చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడి అందరికీ మార్గదర్శకులుగా నిలిచారని చెప్పారు. 1978లోనే చట్టసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారని, పిఎసి ఛైర్మన్‌గా, మంత్రిగా, ప్రజా నాయకుడిగా విశేష సేవలను అందించారని తెలిపారు. జిల్లాలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న గొప్ప సామాజిక కార్యకర్త అని పేర్కొన్నారు. ఆయన గొప్పతనం భావితరాలకు తెలియజేసేందుకు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. అణగదొక్కబడిన బాధితుల పక్షాన అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. ఆయన సమాజానికి చేసిన సేవలను గుర్తించబట్టే, ప్రభుత్వం ఆయన పేరును తోటపల్లి ప్రాజెక్టుకు పెట్టిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, గౌతు లచ్చన్న జీవితమంతా ఉద్యమాలతో సాగిందని, ఏన్నోసార్లు జైలుకు వెళ్లివచ్చారని చెప్పారు. కార్యక్రమంలో తూర్పుకాపు ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జిల్లా బిసి సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ, గౌడ, ఉప కులాల జిల్లా అధ్యక్షులు సిహెచ్ ఆదినారాయణ, రజక సంఘం రాష్ట్ర నాయకురాలు ఇ.విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిఇఒ మాణిక్యంనాయుడు, ఎబిసిడబ్ల్యూఒలు, వసతి గృహ సంక్షేమాధికారులు, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్సుకు నామమాత్రపు రద్దీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణానికి రద్దీ సాధారణంగానే ఉంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బాలికలు, మహిళలు ఉచితంగా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేసేందుకు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఇందుకోసం పోలీసు బందోబస్తు సైతం కావాలని ఆర్‌టిసి అధికారులు పోలీసు అధికారులను కోరారు. కానీ పరిస్థితి చూస్తే శనివారం విజయగనరం ఆర్‌టిసి కాంప్లెక్సులో ఎప్పటి మాదిరిగానే సాధారణ పరిస్థితే నెలకొంది. రెండు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాల వల్లే ఉచిత ప్రయాణమైనప్పటికీ ఉత్సాహం చూపలేదని తెలిసింది. ఈ పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అవుతుందని ఆర్‌టిసి అధికారులు అంచనా వేసి, అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేశారు. అయితే రెండోరోజు సాధారణ పరిస్థితి కనిపించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రయాణికుల్లేక వెలవెలబోయిన ఆర్‌టిసి బస్సు

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పి వకుల్ జిందల్, శనివారం మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్స్ చేపట్టినట్లు ఎస్పి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన మైనర్లకు, మందుబాబులకు కౌన్సిలింగు నిర్వహిం చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీసు అధికారులు విస్తతంగా దాడులు నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 13,260 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మీకోసం కాల్‌సెంటర్ 1100 సేవలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. తమ అర్జీలు పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఎపిజిఇఎ ఆవిర్భావ దినోత్సవం



ఎపిజిఇఎ జెండాను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా యుపి హైకోర్టు అడిషనల్ రిజిస్టర్ విద్యాసాగర్ హాజరయ్యారు. ప్రత్యేక అతిధులుగా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి ఎల్ వి. యుగంధర్, కోశాధికారి సొంటి కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.బాల బాస్కర్, కోశాధికారి వై.శంకరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షులు రామ సూర్యనారాయణ ఆధ్వర్యాన నిర్వహించారు.

జిల్లా కార్యాలయం వద్ద ఆ సంఘం పతాకాన్ని రాష్ట్ర నాయకులు, రీజనల్ డైరెక్టర్ (మెడికల్0 సిహెచ్ శ్రీనివాస్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ గత 6 సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్స్, ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్నారని అన్నారు. జిల్లా అధ్యక్షుకు కంది వెంకటరమణ మాట్లాడుతూ ఉద్యోగులలో చైతన్యం తేవడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకునేందుకు పనిచేస్తున్నా మన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎల్ వియుగంధర్, జిల్లా కార్యదర్శి బి.బాల భాస్కరరావు, అసోసియేట్ ప్రేసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి వై శంకరరావు, ఉపాధ్యక్షులు ఎన్. వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జి.లక్ష్మీనాయుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చింతల వెంకట సతీష్, బియ్యాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రంభ జ్యోతి, ఎస్.కోట కార్యదర్శి పడాల వెంకటరమణ, గజపతినగరం తాలూకా ప్రెసిడెంట్ ఎస్‌ఎ భాషా, ఉపాధ్యక్షులు ఎం.సుధారాణి, నెల్లిమర్ల నాయకులు సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని టిడిపికి చెందిన ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై ఒకింత నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనెల 14న జరిగిన డిఆర్‌సి సమావేశానికి ఒక్కరంటే ఒక్క ఎమ్మెల్యే కూడా హాజరు కాకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఇంతకు మించిన ప్రాధాన్యత ఏముంటుందనేది చాలా మంది వాదన. ఇందుకు కారణం లేకపోలేదు. డిఆర్‌సి (జిల్లా సమీక్షా మండలి) సమావేశం కన్నా మించిన సమావేశం జిల్లా స్థాయిలో మరొకటి లేదనే చెప్పాలి. ఇందుకోసం అధికారులు ప్రోటోకాల్ ప్రకారం ముందస్తుగానే ఆహ్వానాలు పంపుతారు. గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు, సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన పురోగతి, అమలుకు సంబంధించిన అంశాలు తదితర వివరాలను సభ్యులందరికీ ముందస్తుగానే తెలియజేస్తారు. వీటన్నింటికన్నా జిల్లాలో ముందుకు వచ్చిన ప్రజా సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికార యంత్రాంగానికి దిశానిర్ధేశం చేసే అధికారం డిఆర్‌సి సమావేశానికి మాత్రమే ఉంటుంది. జరిగిన తప్పిదాలను, లోటుపాట్లను, అవినీతి, అక్రమాలను సరిదిద్దడం, చర్యలు తీసుకోవడం వంటివి కూడా ఇక్కడే జరుగుతుంటాయి. ఇంతటి కీలకమైన సమావేశానికి నెల్లిమర్ల ఎమ్మెల్యే (జనసేన) లోకం నాగమాధవి మినహా విజయనగరం, బొబ్బిలి, ఎస్.కోట, చీపురుపల్లి, రాజాం ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. వీరంతా టిడిపికి చెందినవారే. నోరు మెదిపితే ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి పాటు పడుతున్నామంటున్న వీరంతా ఈ సమావేశానికి హాజరు కాకకుండా వాటిని ఎలా చక్కదిద్దుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలా అని సమస్యలు లేవా? అంటే కొకొల్లాలుగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం ఉబాలు సాగుతున్న సమయం. తోటపల్లి చివరి ఆయుకట్టుకు నీరు అందడం లేదు. ముఖ్యంగా



చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల్లో తీవ్రమైన ఇబ్బందులు ఉన్నాయి. ఎందుకు అందడంలేదో? క్షేత్ర స్థాయి పరిస్థితులు ఏమిటో సమావేశానికి సారథ్యం వహించిన అమాత్యుల వారికి అర్థం కాని పరిస్థితి. ఎమ్మెల్యేలు హాజరై వాస్తవ పరిస్థితులు తెలియజేస్తే అసలు సమస్య ఏమిటో? దానికి పరిష్కారమైమిటో తెలిసేది. అందుకు పరిష్కారం కూడా దొరికేది. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్, అనధికార పైపులైన్లతో నీటిని అడ్డగిస్తున్నారని అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత ఎమ్మెల్యే హాజరైతే అక్కడి రైతుల ఆవేదన తెలియజేసేవారేమో. ఈనేపథ్యంలో సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడడం సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ అదేశించడం అమాత్యులవారి వంతైంది. మరోవైపు ఎరువుల కోసం రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అధికారులేమో కొదవలేదంటున్నారు. దీనిపై వాస్తవ పరిస్థితులు వివరించేందుకు ఎమ్మెల్యేల గొంతు వినిపించలేదు. పరిశ్రమల మూత, కార్మికుల ఉపాధి దెబ్బతినడం వంటి అంశాలపైనా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చర్చించేందుకు ప్రయత్నించారు. అందుకుగల కారణాలు చెప్పే ప్రజాప్రతినిధులే లేకపోవడంతో అధికారులు చెప్పిన లెక్కలు వినడం తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి అధికారులు లెక్కలు మాత్రమే చెప్ప గలుగుతారు. ఫెర్రో ఎల్లాయిస్ వంటి పరిశ్రమల ఒడిదుడుకులకు గల కారణాలు అధికారుల కన్నా ప్రజాప్రతినిధుల దృష్టిలోనే ఎక్కువగా ఉంటాయి. ఇలా అన్ని శాఖలపైనా తగిన ఫీడ్ బ్యాక్ రాకపోవడంతో అధికారులు చెప్పిందే వేదంగా సమావేశం నడిచిపోయింది. సుపరిపాలన పేరిట గ్రామాల్లో చక్కర్లు కొట్టిన ఎమ్మెల్యేలు, వాటి పరిష్కార వేదికగా ఉపయోగించుకోవాల్సిన డిఆర్‌సి సమావేశానికి డుమ్మా కొట్టడంతో వీరికి ప్రజా సమస్యలపట్ల చిత్తశుద్ధి లేదంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.



ఢిల్లీలో అవార్డు అందుకున్న రాజాం మండల మహిళా సమాఖ్య సభ్యులు

రాజాం ఎంఎంఎస్‌కు అవార్డు

ప్రజాశక్తి- రాజాం

జాతీయ స్థాయిలో ఉత్తమ మండల సమాఖ్యలుగా ఎంపికైన రాజాం మండల సమాఖ్య అధ్యక్షులు రౌతు వెంకటమ్మ, కోశాధికారి కొయ్యాన పార్వతిలకు ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆత్మనిర్భర్ సంఘతన్ అవార్డును అందుకున్నారు. వీరికి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ పురస్కారాలను అందించారు. ఈ సమాఖ్యకు లక్ష రూపాయలు చెక్, సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేశారు. ఈ అవార్డు తీసుకున్నందుకు రాజాం టీమ్ మెంబెర్స్‌కు రాష్ట్ర సెర్ప్ అధికారి వి.కరుణ, సెర్ప్- డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి, ఎపిడి కె.సావిత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ అదనపు ముఖ్య కార్యనిర్వాహణాధికారి రెడ్డి శ్రీరాములు నాయుడు, ఎపిఎం సులోచన, శ్రీనివాస్, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకు ఉత్తమ అవార్డు

వంగర : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్.ఐ షేక్ శంకర్ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. పోలీస్ శాఖలో మండలంలో ఆయన చేసిన సేవలకు గాను 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరంలో ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయనకు అవార్డు రావడంతో స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కంటోన్మెంట్ : పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా విజయనగరం రూరల్ సర్కిల్ పరిధిలో ఉన్న రూరల్, గంట్యాడ పోలీస్ స్టేషన్ల సిబ్బందికి శనివారం మ్యాక్సి విజన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యాన కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ సిబ్బంది వృత్తిలో పడి వైద్య పరీక్షలు చేయించుకోక పోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తరుచూ వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని 31వ వార్డులో శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు మోసాలకు ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిని గెలిపిస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, కౌన్సిలర్లు చోడిగంజి అనసూయమ్మ, పాలవలస ఉమాశంకర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీమంత్రి వాసిరెడ్డికి ఘన నివాళి

బొబ్బిలి : మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి - పార్వతీపురం రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, కొప్పల వెలమ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటులో కష్ణమూర్తి నాయుడు కీలకపాత్ర పోషించారని ఆయన సేవలను కొనియాడారు.



ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాదరావు

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఆర్‌అండ్‌బి జంక్షన్ సమీపంలో గల సహస్ర ఆయుర్వేద స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో మెడికల్ చెకప్ నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. సహస్ర క్లినిక్ వైద్యులు కె.ప్రసాదరావు మాట్లాడుతూ ఆయుర్వేదం ద్వారా పేదలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మెడికల్ చెకప్ పాటు ఉచితంగా మందులు అందజేశామన్నారు. మందులను రాజస్థాన్ ఔషధాలయం, నాగార్జున జండు ఫార్మసీ ఆధ్వర్యాన, రక్త పరీక్షలను వాసవి క్లినికల్ లెబరేటరీ సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనాలు ఏర్పాటు

ప్రజాశక్తి- డెంకాడ



వృద్ధులకు భోజనాలు పెడుతున్న టిడిపి నాయకులు

టిడిపి సీనియర్ నాయకులు, డెంకాడ మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దంతులూరి ప్రదీప్ రాజు పుట్టిన రోజు సందర్భంగా శనివారం విజయ నగరంలోని పూలబాగ్ కోలనీలో ఉన్న ఎటికె వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అక్కడే కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

తూర్పుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు, నగరంలోని తోటపాలెంకు చెందిన రిటైర్డు ఎఎస్‌ఐ ఆర్లె కృష్ణారావు తన సతీమణి పద్మావతి 8వ వర్ధంతి సందర్భంగా శనివారం అన్నదానం చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పలువురు పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు భోజనాలు పెడుతున్న కృష్ణారావు కుటుంబీకులు




మన్యం జిల్లాలో బొబ్బిలిని కలపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గాన్ని పక్కనే ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో కలపాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రయివేట్ స్కూల్లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గాన్ని మన్యం జిల్లాలో కలపడం వల్ల ఆర్థికంగా, భౌగోళికంగా ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. మన్యం జిల్లాకు కేంద్రం నుండి నిధులు ఎక్కువగా వస్తాయని, తద్వారా బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధి పరంగా మరింత ముందుకు వెళుతుందని తెలిపారు. మొదటి నుంచీ పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో బొబ్బిలి ఉందని గుర్తుచేశారు. రెవెన్యూ, న్యాయపరమైన సమస్యల పరంగా వేగంగా పనులు జరగాలంటే 20 కిలోమీటర్ల దూరంలో పార్వతీపురం ఉండటం వల్ల సమయం వృథా కాకుండా ఉంటుందని తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గాన్ని మన్యం జిల్లాలో కలిపే విధంగా స్థానిక ఎమ్మెల్యే బేబినాయన ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నియోజకవర్గ కార్యదర్శి కండాపు ప్రసాదరావు., బిజెపి నియోజకవర్గ అధ్యక్షులు మరిచర్ల రామారావు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముచ్చల శ్రీనివాసరావు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పిల్లా లక్ష్మణరావు, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మినీ గోకులాల నిధులు విడుదల : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - డెంకాడ

2018 - 2019 మధ్యకాలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులాలు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శనివారం నియోజవర్గ స్థాయి నాలుగు మండలాల వెండర్ల సమావేశం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2018 - 19 మధ్యకాలంలో నిర్మించిన మినీ గోకులాలు, సీసీ కాలువలు, రోడ్లు వెండర్స్ నష్టపోకుండా ఉండాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసిందన్నారు. చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం పని చేస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. 10 ఏళ్ల క్రితం నిర్మించుకున్న వాటికి కూడా బిల్లులు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. మండలంలో మినీ గోకులాలు 105, సీసీ కాలువలు, రోడ్డులు 30 మందికి నిధులు విడుదలయ్యాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

వందల్లో నిర్మిస్తే పదుల్లో నిధులా

తాము వందల్లో నిర్మాణాలు చేపడితే పదుల్లో నిధులు ఇస్తే ఎలా అని, ఎవరిని అడిగి ప్రపోజల్స్ పెట్టారని కాంట్రాక్టర్లు అధికారులను నిలదీశారు. మండలంలో మినీ గోకులాలు, సిసి రోడ్లు, కాలువలు డంపింగ్ యార్డ్‌లు వందల్లో నిర్మిస్తే పదుల్లో నిధులు మంజూరవడం ఎంతవరకు సమంజసమని అడిగారు. డెంకాడలో సుమారు 40 మంది గోకులాలు, సిసి రోడ్లు, కాలువలను నిర్మిస్తే 18 మందికి మాత్రమే నిధులు మంజూరు చేశారని, మిగిలిన వారి సంగతి ఏంటని టిడిపి సీనియర్ నాయకుడు కోయ్యినేని రమణ అధికారులను ప్రశ్నించారు. మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నాయకుడు కంది చంద్రశేఖర రావు కూడా అధికారులను నిలదీశారు. ఎవరిని అడిగి ప్రతిపాదనలు పంపించారని ప్రశ్నించారు. దీనికి అధికారులు స్పందిస్తూ గతంలో పంపించిన లిస్టులో ఉన్న వాటిని ప్రభుత్వం మంజూరు చేసి పంపించిందని తామేమీ కొత్తగా ప్రపోజల్ పంపలేదని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే కలుగజేసుకొని అధికారులు పూర్తి సమాచారంతో ప్రపోజల్ పెట్టి వండర్స్‌కి నిధులు వచ్చేటట్టు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, ఎంపిడిఒ వైభవాని, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, ఎపిడి రవికుమార్, టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, కూటమి నాయకులు కలిదిండి పానీరాజు, ఫైల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సమాజం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తే తప్పకుండా ఉన్నత స్థాయికి చేరుకుంటారని ప్రొఫెసర్ పి.వెంకట నర్సింహమూర్తి అన్నారు. శనివారం విజయనగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బి.స్వాతితో కలిసి ఆయన ఆర్య వైశ్య సంఘం, శ్రీ వాసవి ఆర్య వైశ్య సంక్షేమ సంఘం తరపున విద్యార్థులకు ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. కోర్సులో విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు టైలరింగ్ కోర్సు సర్టిఫికెట్లను పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెన్త్, ఇంటర్, ఐఐటి, మెయిన్స్, నీట్, తదితర పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించినందుకు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రవ్వా శ్రీనివాస్ టీమ్ సభ్యులను ప్రశంసించారు. బ్యాంకింగ్ సర్వీస్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడానికి కష్టపడి పనిచేసే యువతకు బ్యాంకింగ్ రంగం గొప్ప అవకాశాలను అందిస్తోందని స్వాతి అన్నారు. విజయనగరం మరియు ఇతర ప్రాంతాలలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడంలో దాతలందరూ మద్దతు అందించాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఆర్య వైశ్య సంఘం కోశాధికారి ఆరిశెట్టి వేణుగోపాల్, ప్రాజెక్ట్ చైర్మన్ బి.ఎం.ఎం.కృష్ణారావు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వొబ్బిలిశెట్టి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి పి.రామారావు, కోశాధికారి వి.ఉపేంద్రరావు, ప్రాజెక్ట్ చైర్మన్ కొల్లా వెంకటరాజు పాల్గొన్నారు.

కుంపల్లిలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కుంపల్లి గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

త్వరలో పెండింగ్ బిల్లులు విడుదల

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


ప్రజాశక్తి-లక్కవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గానికి సంబంధించి నాలుగు కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు త్వరలో విడుదల అవుతాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం లక్కవరపుకోటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014-19 మధ్య టిడిపి నాయకులు, ప్రజలు చేసిన ఉపాధి హామీ పనులు, మినీ గోకులాలు, ఎస్‌డబ్ల్యుపిసి, శ్మశానవాటికల ప్రహరీగోడల బిల్లులు గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మంజూరు కాలేదన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచెయ్యాలనే లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి కక్షకట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలాలు, గ్రామాల వారీగా పెండింగ్ బిల్లుల జాబితాను అధికారుల ద్వారా పంపించామని తెలిపారు. పెండింగ్ బిల్లుల లబ్ధిదారుల వివరాలు సరి చేసుకోవాలని చెప్పడంతో ఈ సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. నియోజకవర్గంలో మినీ గోకులాల బిల్లులు రూ.1.51 కోట్లు విడుదల కానున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్ బిల్లులు రూపంలో రూ.2.12 కోట్లు త్వరలో మంజూరు చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర దాసరి సంక్షేమ బోర్డు చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, డిఇ స్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో సందడి చేశారు. నగరంలోని గురజాడ కళాభారతి ఆడిటోరియంలో ప్రబోధా సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యాన వేడుకలు జరిగాయి. . ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్యే గాదె శ్రీనివాసుల నాయుడు హాజరయ్యారు. సమితి అధ్యక్షుడు వి.శంకరరావు మాట్లాడారు. కార్యక్రమంలో కేసలి అప్పారావు, ముద్దాడ మధు, గదుల సత్యలత, నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నెల్మిర్ల నగర పంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల, జరజాపుపేటలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. పురవీధుల్లో కృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. జరజాపుపేట నాయుడు యువత ఆధ్వర్యంలో ఉట్టి ఎగురవేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

\- ప్రజాశక్తి విలేకర్లు



కొత్తవలసలో... ఎమ్మెల్యే లలితకుమారి పూజలు



నెల్లిమర్లలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న టిడిపి నాయకులు



గజపతినగరంలోని హర్షవర్ధన పాఠశాలలో విద్యార్థులు దేవాన్ష్



వేపాడ మండలంలో శ్రీకృష్ణుడి ఆలయంలో..



విజయనగరంలోని వైఎస్ఆర్ కాలనీలో తేజ, కృష్ణక నందన



రామభద్రపురం. గోపిక వేషధారణలో చిన్నారి



మెంటాడ రోడ్డులో మోకాలు లోతులో నిలిచిన నీరు

చినుకు పడితే చెరువే

మోకాలు లోతు నీటిలో మెంటాడ రోడ్డు

ప్రజలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

గజపతినగరం కేంద్రంలోని మెంటాడ రోడ్డు చినుకు పడితే చాలు చెరువులా మారుతుంది. వర్షం పడినప్పుడల్లా వాహనదారులకు, పాదచారులకు, పురిటిపెంట న్యూకాలనీ వాసులకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. అధ్వానంగా ఉన్న మెంటాడ రోడ్డుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు 35 లక్షల రూపాయలతో మరమత్తు పనులు చేపట్టింది. ఈ పనుల సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపంతో గుత్తేదారు తన ఇష్ట రాజ్యంగా పనులు చేపట్టాడన్న విమర్శలు ఉన్నాయి. మెంటాడ రోడ్డులోని కొల్లా సాంబమూర్తి కాంప్లెక్స్ వద్ద, ఆర్కే ఫ్యామిలీ మార్ట్ వద్ద కూడా రోడ్డు పల్లం చేయడంతో, వర్షం పడినప్పుడల్లా ఈ రెండు ప్రాంతాల్లో చెరువులను తలపించేలా నీరు నిలిచిపోతుంది. అలాగూ వ్యాపారులు కాలువ గట్లపై సిమెంట్ పలకలతో పక్కా నిర్మాణాలు చేపట్టడంతో నీరు కాలువల్లోకి వెళ్లే పరిస్థితి లేకపోతుంది. ఈ నేపథ్యంలో వర్షాలు పడినప్పుడల్లా ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మెంటాడ రోడ్డు విస్తరణ పనులపై ప్రకటన చేసి ఆశలు రేపిన కూటమి నేతలు, ఆ తర్వాత మౌనం వహించడం పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గురజాడ సాహిత్య సంపదను కాపాడుకోవాలి

లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

తెలుగు జాతికి తరగని గొప్ప సాహిత్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి గురజాడ అప్పారావు స్మారక భవనాన్ని, సాహిత్య సంపదను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి కోరారు శనివారం గురజాడ గృహంలో గురజాడకు నివాళులు అర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గురజాడ రచనలను భద్రం చెయ్యాల్సిన ఆర్కియాలజీ విభాగం, రాష్ట్ర టూరిజం శాఖ పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గురజాడ గృహాన్ని, గురజాడ సాహిత్యాన్ని కాపాడటంలో పూర్తిగా విఫలమౌతున్నారని తెలిపారు. గురజాడ అప్పారావు ఇంటిలో తాగుబోతు హాల్ చల్ చేసి,సాహిత్య సంపాదని, వస్తువులను చిందరవందర చేసిన ఘటన తెలిసి కూడా రాష్ట్ర హోం శాఖ మంత్రి జిల్లా ఇంచార్జి మంత్రి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్,ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గాని గురజాడ ఇంటిని సందర్శించకపోవడం అన్యాయమని అన్నారు. మహాకవి ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పాదచారులు, చుట్టుపక్కల ఉన్నవారు ఉచ్చల దొడ్డిగా ఉపయోగిస్తున్నా కార్పొరేషన్ అధికారులకు కూడా చలనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గురజాడ అప్పారావు సాహిత్య సంపదకు,గురజాడ స్మారక భవనానికి తగిన రక్షణ కల్పించాలని భీశెట్టి కోరారు. సమావేశంలో పౌర వేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, సహాయ కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్ రావు, ఇప్పలవలస గోపి, తాడేపల్లి నాగేశ్వరరావు, అల్లంశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

బొబ్బిలిలో రైతుల ట్రాక్టర్ల ర్యాలీ



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా

ప్రజాశక్తి-బొబ్బిలి

అన్నదాత సుఖీభవ నిధులు జమకావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం బొబ్బిలి పట్టణంలో ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలను అమలు చేసినట్లు ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు చెప్పారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు గిరడ అప్పలస్వామి, మరిశర్ల రామారావునాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆశాలు

పట్టణంలోని కోటలో శనివారం ఎమ్మెల్యే బేబినాయనను ఆశా కార్యకర్తలు కలిశారు. ఆశా కార్యకర్తలకు వయోపరిమితి 62 ఏళ్లకు పెంచి గ్రాడ్యుటీ రూ.1.50 లక్షల వరకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో బేబినాయనను కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆశా కార్యకర్తలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఆశా కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు శాంతమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మెగా డాన్స్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైనా శనివారం ఉదయం మెగా డాన్స్ పోటీలు నిర్వహించారు. జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు ఆధ్వర్యాన కనపాక రితిక్ డాన్స్ స్టూడియోలో జరిగాయి. ముఖ్య అతిధిగా హాజరైన గోవింద్ బ్యాగ్స్ అధినేత కోరాడ గోవింద్ మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవి అభిమానులు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోటీలకు జడ్జిగా ప్రముఖ డాన్సర్ రితిక్ వ్యవహరించారు. విజేతలకు కోరాడ గోవింద్ బహూకరించిన స్కూల్ బ్యాగ్స్‌ను జిల్లా చిరంజీవి యువత ప్రతినిధులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు లాలిశెట్టి రవితేజ, యువనాయకుడు లోపింటి కళ్యాణ్ అందజేశారు.

BEFORE THE HONOURABLE CIVIL JUDGE COURT OF THE PRINCIPAL JUNIOR VIZIANAGARAM
I.A.538/2024 O.S.No. 603 /2024

Between:
Sri. Gandrati Srinu .....Plaintiff
And:
Smt. Thirumareddy Maheswari and 3 others .....Defendants

ప్రకటన

1. Smt. Thirumareddy Maheswari w/o late Srinivasarao, aged 33 years, Hindu, residing at D.No. 2-189 Chinna Veedhi, Dharmapuri, now within Vizianagram Municipal Corporation, Vizianagram.
2. Chy. Thirumareddy Harsh S/o late Srinivasarao, aged 10 years, Hindu, residing at D.No. 2-189 Chinna Veedhi, Dharmapuri, now within Vizianagram Municipal Corporation, Vizianagram.
3. Chy. Thirumareddy Surya S/o late Srinivasarao, aged 8 years, Hindu, residing at D.No. 2-189 Chinna dhi, Dharmapuri,now within Vizianagram Municipal Corporation, Vizianagram.

పై నెంబరు గల దావాలో వాదిగారు మీపై ఆస్తి అమ్మకం విషయమై దావా వేసియున్నారు. అయిన 1, 2, 3 అయిన ప్రతివాదులు అయిన మీరు దావా సమనులు నిమిత్తం **తే 25-8-25దీ**న పై తెలిపిన కోర్టులో వాయిదా యున్నది. కావున మీరు 1 ఆసామి మరియు 2, 3 (మైనర్లు) ఆ దినమున మీ ముగ్గురు స్వయముగా గాని మీ తరుపున వకీలు ద్వారా గాని **ఉదయం గం॥ 10-30 ని॥**లకు హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడం అగునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

ఇట్లు
I.Suresh
Advocate, Vizianagaram
Cell: 9440169343